క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ బాలపేట, వైఎస్సార్ నగర్, వెలుగుమట్లకాలనీకి చెందిన 10మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని పేర్కొన్నారు.

విజయవంతం చేయండి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 25 నుంచి అక్టోబర్ 3వరకు నిర్వహించిఏ శ్రీస్వామి అధ్యాయన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థానం చైర్మన్ కనమర్లపూడి రమేష్ కోరారు. మండల కేంద్రంలోని దేవాలయంలో ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. పాలకవర్గ సభ్యులు మోర మల్లయ్య, కోటేశ్వరీ, కొండబాల రాంబాబు, అనంతు సత్యనారాయణ, సీతారాములు, సత్యం, ఈఓ కె.శ్రీకాంత్, ఆలయ అర్చకులు తుపురాణి మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

'నషాముక్త్ భారత్'పై అవగాహన

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో ఎన్ఎస్ఎస్ శీతాకాలపు ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం గ్రామంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని నషాముక్త్ భారత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్ప్ జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల లక్షణాలు, లక్ష్యాలపై వివరించి నషా ముక్త్ భారత్, స్వదేశీ వస్తు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఖమ్మంక్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. వాహనాలకు రవాణాశాఖ నిర్దేశించిన రీతిలో నంబర్ ప్లేట్, సైలెన్సర్ ఉండేలా చూసుకోవాలన్నారు. లేనిపక్షంలో అట్టి వాహనాలను ఆపి వాటికి జరిమానా విధించడంతో పాటు పాత చలానాలు చెల్లించాకే తిరిగి ఇవ్వబడుతుందన్నారు. సైలెన్సర్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటి స్థానంలో వేరే సైలెన్సర్ మార్పించబడుతుందన్నారు.

ప్రహరీ కూల్చివేతపై కేసు

ఖమ్మం అర్బన్: ఇంటి స్థలాలకు రక్షణగా నిర్మించిన ప్రహరీ కూల్చివేతపై ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం వెలుగుమట్ల రెవెన్యూ సర్వే నంబరు 147లోని టీఎన్‌జీఓఎస్ కాలనీలో పోపూరి రవిమారుత్‌కి 1, 2, 22, 23 నంబరు ప్లాట్లు ఉన్నాయి. వాటికి రక్షణగా నిర్మించిన ప్రహరీని గోవిందరావు అనే వ్యక్తి యంత్రంతో కూల్చివేశాడని, అడ్డుకోవడానికి ప్రయత్నించిన రవిమారుత్‌కు సంబంధించిన వ్యక్తి నరేశ్‌బాబును నెట్టేశాడని రవిమారుత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పేద విద్యార్థినికి చేయూత

ఖమ్మంగాంధీచౌక్: ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బి.గీతికకు లయన్స్ క్లబ్ చేయూతనందించింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ జగదీష్‌బాబు ఆధ్వర్యాన రూ.40వేలు విలువ చేసే ల్యాప్‌టాప్, ఫీజు కోసం రూ.21వేలను అందించామన్నారు. వైద్యులు ఎ.రాఘవరెడ్డి, క్లబ్ కార్యదర్శి దుర్గా నాగేశ్వరరావు, కోశాధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'చాంబర్ ఆఫ్ కామర్స్'గా కొనసాగింపు

ఖమ్మంగాంధీచౌక్: వర్తక సంఘం, ది ఖమ్మం మర్చంట్స్ అసోసియేషన్‌ను సంఘం చాబర్ ఆఫ్ కామర్స్‌గా చట్టబద్ధంగా కొనసాగింపునకు నిర్ణయించామని సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు తెలిపారు. ఆదివారం స్థానిక వర్తక సంఘం భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్తక సంఘ కార్యకలాపాలకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా వ్యవహరిస్తామని తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, పూర్వపు కార్యదర్శి గోడవర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జీ.వై.నరేష్, కోశాధ్యక్షుడు తల్లాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్‌కు చేయూత



నగదు అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంక్రైం: ఇటీవల జరిగిన ఖేలో ఇండియా మహిళల రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ లీగ్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆదిలక్ష్మి కుమార్తెటోనికి ఆదివారం ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఆధ్వర్యాన రూ.5 వేల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. బెంగుళూరులో జరగబోయే మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సౌత్ ఇండియా తరఫున పాల్గొననున్నందున ఆమెకు అభినందనలు తెలిపారు. ఖమ్మం వన్‌టౌన్ ఎక్సైజ్ సీఐ కృష్ణ, రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ వెంకట్రావ్, అసోసియేషన్ అధ్యక్షుడు కరీం పాల్గొన్నారు.



బతుకమ్మలతో బయలుదేరుతున్న మహిళలు



బతుకమ్మలు తీసుకొస్తున్న మహిళలు



వీడీవోస్ కాలనీ రైతుబజార్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బుర్హాన్‌పురంలో..



ఖమ్మం అర్బన్ : యూపీహెచ్ కాలనీలోని అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..

ఖమ్మం బ్యాంక్ కాలనీలో తులసి చెట్టు ముందు బతుకమ్మలు పెట్టి పూజలు చేస్తున్న మహిళలు





పూలోత్సవం..

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆడపడుచులు ఆదివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మను మహిళలు తీరొక్క పూలతో గౌరమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం వేళ సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను ఆలయాలు, జలాశయాల వద్దకు తీసుకెళ్లి ఆట, పాటలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో మహిళలతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొని ఆడిపాడడంతో సంబరాలు అంబరాన్నంటాయి. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహం (బి)లో..



కూసుమంచి: పెరికసింగారంలో ..



ఖమ్మంలో నృత్యం చేస్తున్న మహిళలు



బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న డీడబ్ల్యూఓ, మహిళా ఉద్యోగులు

కలెక్టరేట్‌లో ఎంగిలిపూల బతుకమ్మ

ఖమ్మంమయూరిసెంటర్: కలెక్టరేట్‌లో మహిళ, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి మాట్లాడగా కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు, ఉద్యోగి వెంకన్న, సీడీపీఓలు, మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ



ఖమ్మంలోని విజయనగర్ కాలనీలో బతుకమ్మ పేర్చుతున్న మహిళలు



సోలిపురంలో బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు



ఖమ్మం గుంటు మల్లన్న ఆలయంలో..



తిరుమలాయపాలెం: జూపెడలో..



హార్వెస్ట్ పాఠశాలలో బతుకమ్మను తీసుకొస్తున్న ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, ఉపాధ్యాయులు

సెలవుల్లోనూ 'ప్రైవేట్' తరగతులు దారుణం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రత్యేక తరగతుల పేరిట దసరా సెలవులు, ఆదివారం రోజున కూడా ఖమ్మంలోని ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటేష్ డిమాండ్ చేశారు. సెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వాటిని తుంగలో తొక్కి తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుండి అక్టోబర్ 3 వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించినా తరగతులు నిర్వహిస్తున్నారని, అయినా విద్యాశాఖ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరించారని మండిపడ్డారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, పృథ్వీ, నాయకులు సందీప్, అశోక్, వెంకటేష్, స్టాలిన్, నరేందర్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ఆదర్శప్రాయుడు జియావుద్దీన్

ఖమ్మం సహకారనగర్: నిత్యం ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి పాటుపడిన జియావుద్దీన్ ఆదర్శప్రాయుడిగా నిలిచారని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కొనియాడారు. ఖమ్మం మంచికంటి భవన్‌లో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన జియావుద్దీన్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అలాగే, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఆదివాసీల విద్యాభివృద్ధి కోసం కృషి చేయడమే కాక ఆతర్వాత జెడ్పీ కోఆప్షన్ సభ్యుడిగా ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. టీ జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, టీజీవోస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్‌తో పాటు ఉపాధ్యక్షులు దుర్గా భవాని, జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్‌తో పాటు పోతినేని సుదర్శన్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వర్లు, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో దయాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన ముదిరాజు వర్గానికి చెందిన సుమారు 40 కుటుంబాలు ఆదివారం వివిధ పార్టీల నుంచి మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్‌గౌడ్, నాయకులు జడల రమేష్, చీకటి శ్రీను, బాజా సత్యనారాయణ, నేలమర్రి నాగేందర్, సోమనబోయిన మహేష్, మల్లారపు యాకన్న, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో..

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లిలో గద్దం వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన బీజేపీలో చేరగా.. మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, భువనాసి దుర్గారావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కొండా హర్ష, భూలక్ష్మి, కాశయ్య, వేణుబాబు, మూడు రమేష్, క్రాంతి, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

గోశాలలకు వితరణ



గొల్లగూడెం గోశాలకు వితరణ చేస్తున్న దాత

ఖమ్మంఅర్బన్: అమావాస్య ఆదివారం సందర్భంగా నగరంలోని గొల్లగూడెం, టేకులపల్లి గోశాలలకు భక్తులు పశుగ్రాసం కోసం విరాళాలు అందించారు. గోశాల నిర్వాహకులు భక్తుల నుంచి బియ్యం, పశుగ్రాసం, ఆర్థిక సాయాన్ని స్వీకరించారు.శివవైష్ణమి ఫుడ్స్ ఆధ్వర్యాన గోగ్రాసం కోసం రూ.14 వేలు, పవన్, ఐరన్ దుకాణాల అధినేతలు వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే రూ. 81 వేల విలువైన దాణాను వితరణ చేశారు. గొల్లగూడెం, టేకులపల్లి గోశాలలతో పాటు త్రీటౌన్‌లోని శ్రీలక్ష్మీ రంగనాథస్వామి ఆలయంలోని గోశాలకు కలిసి రూ.81వేల దాణా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, రామారావు, మల్లేష్, సాయికుమార్, నవీన్, పుల్లారావు, జంగిలి రమణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: గీత కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోడపట్ల సుదర్శన్ అన్నారు. ఆదివారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని, పింఛన్ రూ.4వేలకు పెంచాలని, ద్విచక్రవాహనాలు ఇవ్వాలని, గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను నిరోధించాలని, ప్రతీ సొసైటీకి కమ్యూనిటీ భవనం నిర్మించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కొండం కరుణాకర్, సత్యం, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

ఖమ్మం మామిళ్లగూడెం: కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ రోడ్డులో గల కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, నగర అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, కల్లూరు మండల ప్రధాన కార్యదర్శి మోడేపల్లి వెంకటాచారి, యువజన అధ్యక్షులు కూరపాటి సతీష్, సీనియర్ నాయకులు గురులింగం, పులిపాటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



విద్యానగర్ కాలనీ నూతన కమిటీ సభ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 1వ, 4వ డివిజన్లతో ఏర్పడిన విద్యానగర్ వాసుల సమావేశంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం కొత్త కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మోతె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా బానోత్ బాలు నాయక్, రేగులగడ్డ ప్రభావతి, సంయుక్త కార్యదర్శిగా జాలాది లెనిన్, కోశాధికారిగా గోదా వెంకటనాగమల్లేశ్వరరావు, కార్యదర్శులుగా జి.హరనాథ్, డాక్టర్ ఎస్.మంగీలాల్ జాదవ్, ఎస్‌కె.రబ్బానీ, డి.వెంకటేశ్వరరెడ్డి, తూము పద్మరాణి, మోతుకూరి జయశ్రీ, జె.రాములుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

నగర శాఖ నూతన కమిటీ..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఇందిరానగర్‌లోని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నగర శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా వి.కనకారావు, ఉపాధ్యక్షులుగా బి.సైదులు, కె.రాంప్రసాద్, కార్యదర్శిగా జి.రాంబాబు, సహాయ కార్యదర్శులుగా గౌస్ పాషా, కె.వరలక్ష్మి, కోశాధికారిగా ఎస్‌కె.జానివియా, ప్రచార కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు, పి.సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా జయనాబీ, ఉపేందర్, ప్రమోద్‌కుమార్, వెంకటరత్నం, వి.వనజ, భాగ్యలక్ష్మి, మేరి, దుర్గారావులను ఎన్నుకున్నారు. కాగా, ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్కు, సహాయ ఎన్నికల అధికారిగా పి.వెంకటమణ వ్యవహరించారు.

నవరాత్రులు.. 11రోజులు!

- ముస్తాబైన ఆలయాలు, మండపాలు
- కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలు

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ లైట్ల వెలుగుల్లో శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం



ముస్తాబవుతున్న అమ్మవారి మండపం

ఖమ్మంగాంధీచౌక్: భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే ఆదిపరాశక్తిగా కొలిచే అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. అశ్విని మాసం శుక్లపక్షంలో ప్రారంభమయ్యే ఈ నవరాత్రులు ఈఏడాది నేటి(సోమవారం) నుంచి అక్టోబర్ 2 విజయ దశమితో ముగుస్తాయి. ఎప్పటిలా తొమ్మిది రోజులు కాకుండా పది రోజులు జరగడం విశేషం. చివరి రోజు విజయ దశమితో కలుపుకొని 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు పండితులు చెబుతున్నారు. అమ్మవారిని నిత్యం ఒక్కో రూపంలో అలంకరించి ఆరాధించడం వలన అందరికీ మంచి జరుగుతుందని చెబుతున్నారు.

ప్రత్యేక అలంకరణలు, పూజలు

శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలతో పాటు నిత్యం నైవేద్యాలను సమర్పించనున్నారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు మాలధారణ స్వీకరించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈనేపథ్యాన అమ్మవారు శ్రీవజ్రకవచ, శ్రీత్రిపుర సుందరీదేవి, శ్రీ వారాహిదేవి, శ్రీఅన్నపూర్ణాదేవి, శ్రీ అర్ధనారీశ్వరీ దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ సరస్వతీదేవి, శ్రీ నవదుర్గా, శ్రీ మహిషాసుర మర్దినిదేవి రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. వడపప్పు క్షీరాన్నం, గారెలు, జాంగ్రీలు, పెసర పునుకులు, పాయసం, బొబ్బట్లు, పులిహోర వంటి ఆహార పదార్థాలను నైవేద్యంగా పెడతారు. గోపూజలు, కుంకుమ, సరస్వతి పూజలు వంటివి నిర్వహిస్తారు.



కొలువు దీరిన అమ్మవారు

శరన్నవ రాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ బాధ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయాలు, మండపాలను విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని ప్రతిష్ఠించి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. అయితే అమ్మవారి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కొబ్బరి పీచుతో రాజస్తాన్ కళాకారులు తమ కళానైపుణ్యంతో తయారుచేసి విక్రయించారు.

ఉత్సవాలు ప్రత్యేకం



శరన్నవరాత్రి ఉత్సవాలను శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేకంగా, వైభవోపేతంగా నిర్వహిస్తాం. ఓ వైపు అమ్మవారి ఉత్సవాలు, మరో వైపు బతుకమ్మ పండగ వేడుకలను కూడా నిర్వహించడం ఆనవాయితీ. ప్రతి రోజు అమ్మవారిని ఒక్కో అలంకరణలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తాం.

– మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, చైర్మన్, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం

వైభవంగా నిర్వహిస్తాం..



అమ్మవారు ఉపద్రవాలను నిలువరించే శక్తి స్వరూపిణి. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ఆదిపరాశక్తిగా కొలిచే అమ్మవారి ఉత్సవాలను శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యాన నగరంలో జమ్మిబండపై పారువేట, దసరా వేడుకలను వైభవంగా నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం.

– కొత్తూరు జగన్మోహన్‌రావు, ఈఓ, శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం